



ఆ రోజు సినిమాకు వెళ్దామంది సుశీ. మంచి చిత్రం ఒకటి ఆ రోజే ఆఖరు కావడంవల్ల నేను వెంటనే ఒప్పుకున్నాను. సరే ఫస్టు షోకి వెళ్లాలని నిశ్చయించాము.

సాయంకాలం అయిదున్నరవుతోంది. లోపల సుశీ టాయిలెట్ అవుతోంది. సినిమా కెళ్లడానికి తయారయేందుకు ఆమె పడుతున్న అవస్థ చూస్తూంటే నాకు నవ్వాగలేదు.

ఒదులుగా జడ వేసుకుని మల్లెదండ తురుముకోవాలా ? లేక చుట్టచుట్టుకుని దానిచుట్టూ పూలు పెట్టుకోవాలా ? చీర ఏది కట్టుకోవాలి ? మామూలు సిల్కుచీర బాగుంటుందా ? లేక జరీ చీర బాగుంటుందా ?—ఇలా అన్నీ సమస్యలేఆమెకు.

అద్దంముందు కూర్చుని అరగంటసేపయినా ఇంకా ఏదీ నిర్ధరించుకోలేకపోతోంది. నేను బయట వరండాలోకొచ్చి నిలబడి నాలో నేనే నవ్వుకుంటున్నాను.

"బాబయ్యగారూ !" అన్న పిలుపు విని నేను తిరిగి చూశాను. మా నౌకరు గంగారాం నిలబడి ఉన్నాడు.

"ఏమిటి గంగారాం ? ఏం సంగతి ?" అడిగాను నేను.

"మరేనండి...." ఆతరువాత చెప్పలేకనీళ్ళు మింగాడు.

"ఆపేశా వెందుకు ? ఏం కావాలో చెప్పు గంగారాం ?"

"మరేనండి .... " మళ్లీ పాత పాటే.

అతనలా నాన్చడం చూసి నాకు విసుగెత్త నారంభించింది.

"త్వరగా చెప్పు గంగారాం. అవతల సినిమాకు టైమవుతోంది" అన్నాను.

అతను తడబడుతూ అన్నాడు : "నాకో పావలా కావాలండీ .... !" అని.

"ఓస్ ఇంతేగదా !" అని జేబులోంచి పర్సు తీసి చూశాను. అందులో సరిగ్గా మూడు రూపాయిలే ఉన్నాయి. చిల్లర ఒక్క నయాపైసా కూడా లేదు. మా ఇద్దరి టికెట్లకు మూడు రూపాయిలే అవుతుంది. థియేటర్ దగ్గరే కాబట్టి రిక్షాకి డబ్బు అక్కరలేదు. ఇప్పుడేం చేయను ? ఎప్పుడూ మధ్యలో డబ్బు అడగని గంగారాం ఇవాళ నోరుతెరిచి ఒక్క పావలా అడిగేసరికి నా దగ్గర డబ్బులు లేవని ఎలా చెప్పడం ? పోనీ ఇంట్లో ఏమన్నా చిల్లరడబ్బులున్నాయా అంటే అదీలేదు. నెలాఖరుకదా ! పోనీ సినిమా చూడటం మానేద్దామా అంటే ఆవేళ ఆఖరిరోజు. ఇప్పుడేం చేయాలి ?

"గంగారాం ...." అన్నాను అతి ప్రయత్నంమీద.

ఆశతో నా మొహంవైపు చూశాడు గంగారాం.

"ఇవాళ నాదగ్గర ఎక్కువ డబ్బులు లేవు గంగారాం. రేపు
కుని ఇస్తాను. 
గంగారాం మా
కుని అక్కడినుంచి
మేము వెళ్లి
బాగుందని చెప్పు

ప్పకదూ! రేపు జీతమందు
కీనా ?"

న్లాడలేదు. మౌనంగా తలొంచు వెళ్ళిపోయాడు.

చూస్తున్న చిత్రం చాలా
నా, నాకుమాత్రం చూస్తు న్నంతసేపూ అందులోని దృశ్యాలూ, ఆ కథా ఏవీ నా మనసు కెక్కలేదు. నా మనసంతా ఎలాగో ఉంది. తెరమీద చిత్రం కదలుతున్నా, నా మనసులో మాత్రం మా నౌకరు గంగారాం జాలిగా నావైపు చూస్తూ పావలా అడుగుతున్న దృశ్యమే మెదుల్తోంది.

అతనెంత అవసరంవుండి అడిగాడో ఆ పావలా ? నేను నిర్మొహమాటంగా "లేదు" అన్నానే ? పాపం! అతనికెంత నిరాశ కలిగిఉంటుందోకదా! నా ఒక్కడి కోసం అయితే ఆరోజు సినిమా మానేసేవాణ్ణి కాని సుశీని ఆరోజే సినిమాకు తీసికెళతానని చెప్పి, అంతా తయారయినతరువాత వెళ్లడం మానుకుందామంటే ఆమెకు తీరని ఆశాభంగం కలుగుతుంది. ఆమెమొహం ముడుచుకోవడం నాకు ఇష్టంలేదు. అందుకనే ఏమయితేనేమని అతనికి లేదని చెప్పేశాను. వెధవది ఒక్క పావలా నాదగ్గర ఎక్కువ లేకపోవడంవల్లనే వచ్చిందీ ఇబ్బందంతా .... అబ్బా! నాలోకూడా ఇంత స్వార్థం గూడుకట్టుకుని ఉందా ?

నే నిక్కడ సుశీపక్కన కూర్చుని హాయిగా సినిమా చూస్తున్నాను. అక్కడ అతను నిరాశా హృదయంతో, బాధగా నిట్టూర్పులు విడుస్తూ, శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడేమో! తలుచుకుంటేనే బాధగా ఉంది. అబ్బ! నే నెంత కఠిన హృదయుణ్ణి! నేనెంత స్వార్థపరుణ్ణి!

సుశీ చిత్రాన్ని చూస్తూ మధ్యమధ్య ఆ చిత్రాన్నిగురించి ఏమేమో ప్రశ్నలు అడుగుతూనే ఉంది. కాని నాకు ఆ చిత్రంమీద మనసుంటేగా ? అసలు తెరమీద కదలుతున్న దృశ్యాలేమిటో, ఆ సన్నివేశాలేమిటో అర్థమయితేగా ? ఆమెప్రశ్నల కన్నిటికీ "అవును", "ఓహో"





ఉత్సాహానికి
హుషారుకు
కారణం!
రాగోలైన్




ఈ పుష్టికరమైన ఆహార పానీయమును
మీరుకూడా పుచ్చుకొని యెల్లప్పుడు
ఉత్సాహంగా వుండండి !!

ఫైన్ కెమికల్ వర్క్సు,
పి. బి. 71, మైసూరు-4



కుటుంబము అంతకీ...

కాల్గేట్ ఆల్-పర్‌పస్ టాల్క్‌లో వింతైన పుష్పముల
చాలసేపు ఉండే పరిమళము లభిస్తుంది



పొదుపు మరియు
పేరుగాంచిన కాల్గేట్
నాణ్యత....



స్నానానంతరము,
దుస్తులు ధరించే ముందు
మరియు వీధిలోకి
వెళ్లినపుడు, కాల్గేట్
టాల్క్‌ను మీ ఒళ్లంతా
జల్లుకోండి....



మృదువైన మరియు
సౌమ్యమైన
యీ పౌడరు
పాపాయి లేత
చర్మమునకు దివ్యమైనది.




కాల్గేట్
ఆల్-పర్‌పస్ టాల్క్


# పావలా కోసం

ఇలా సమాధానాలు చెపుతూ ఎలాగో సినిమా పూర్తయేదాకా కాలక్షేపంచేశాను.

ఇంటికి వచ్చేటప్పుడు కూడా పరధ్యానంగానే ఉన్నాను.

తలుపు తట్టగానే గంగారాం వచ్చి తలుపు తెరిచాడు. విద్యుత్కాంతిలో అతని మొహం కళా విహీనంగా కనపడింది.

ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. కళ్లు మూసినా, తెరిచినా మా నౌకరు గంగారాం దీనవదనమే ప్రత్యక్షమవుతోంది. పక్కమీద అటూ ఇటూ దొర్లుతూ ఉండిపోయాను. ఒక్కసారి ప్రశాంతంగా నిద్రపోతున్న సుశీవైపు చూశాను. ఒక్కక్షణం ఆమెమీద అసూయ కలుగకపోలేదు నాకు.

హాల్లోని గడియారం టంగున ఒంటిగంట కొట్టింది. ఇహ పక్కమీద పడుకోవడం అసాధ్యమనిపించి, లేచి బయట వరండాలో కొచ్చి నిల్చున్నాను. గుడ్డిగా కాస్తోంది వెన్నెల. అక్కడే చింకి చాప పరుచుకు పడుకుని ఉన్నాడు గంగారాం. అతనికికూడా నిద్రపట్టలేదు కాబోలు అటూ యిటూ దొర్లుతున్నాడు.

దగ్గరగా వెళ్లి "గంగారాం !" అని పిలిచాను

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"నిద్ర పట్టడంలేదా ?" అని ప్రశ్నించాను.

మౌనం వహించాడు.

"ఇక్కడ చలిగా ఉంటే లోపలికొచ్చి పడుకోరాదూ ?" అన్నాను.

"వద్దండి బాబయ్యగారూ ! ఇక్కడే బావుంది" అన్నాడు.

ఎందుకో అతనిగొంతుక ఒణుకుతున్నట్టనిపించింది నాకు.

"అలా ఉన్నావేం ? ఒంట్లో బాగుండలేదా ?"

"బాగానే ఉంది బాబయ్యగారూ !" అన్నాడు తన తడబాటును కప్పిపెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ.

"సరే అయితే ఒంటినిండా కప్పుకుని పడుకో!" అని లోపలికి నడిచాను.

నా మాటలకు మెలకువ వచ్చిందేమో సుశీ మంచంమీద లేచి కూర్చుంది. నేను దగ్గరకు వెళ్లగానే నావైపు ప్రశ్నార్థకంగా చూసింది. ఉన్నట్టుండి నాకు దుఃఖం పొంగుకొచ్చింది. చెప్పొద్దూ గట్టిగా ఏడ్చేశాను. సుశీ కంగారుపడిపోయింది.

"ఏమిటండీ ? ఏమయింది ?" అంది భయపడిపోతూ.

దుఃఖంలో నా గొంతుక పూడుకుపోయి మాట పెగలలేదు.

"అయ్యో ! మీకు పుణ్యం ఉంటుంది చెప్పండి. ఉన్నట్టుండి ఇలా ఏడుస్తున్నా రేమిటి ?" అని నా మొహాన్ని రెండుచేతులతో దగ్గరగా లాక్కుని హృదయానికి హత్తుకుంది.

భయంతో ఆమెగుండెలు దడదడా కొట్టుకోవడం స్పష్టంగా వినిపించింది నాకు.

నా నోటినుండి ఒకే ఒకమాట వెలువడింది. "ఏంలేదు సుశీ ! పావలా .... !" అనేసి గబుక్కున మంచంమీద వాలిపోయాను.

* * *

రోజులు గడుస్తున్నకొద్దీ గంగారాం వైఖరి మారిపో నారంభించింది. ఇంటిపనుల్లో ఏ పొరపాటూ చేయకపోయినా అతని ప్రవర్తనలో మాత్రం మునుపటి ఉత్సాహం లేదు. యాంత్రికంగా పనులు చేసుకుపోతున్నాడు. అప్పుడప్పుడు ఏదో పరధ్యానంలో పడిపోయి దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయేవాడు.

అతని వయస్సు ముప్పై ఏళ్లయినా వయసు మళ్లిన వృద్ధుడిలా అన్నిటికీ ఉదాసీనతను ప్రదర్శించేవాడు. అది చూసి నాకు ఎలాగో అనిపించేది.

గంగారాం మా ఇంట్లో నౌకరే అయినా తన సత్ప్రవర్తనతో మా అభిమానాన్ని చూరగొన్నాడు. శ్రద్ధగా పనిచేస్తూ, మాపట్ల ఎంతో భక్తి విశ్వాసాలను కనబరిచేవాడు. అలాంటివాడు ఏదో బరువును మోస్తున్నట్టూ, బాధతో క్రుంగిపోతున్నట్టూ ఉండడం చూసి నాకు బాధకలిగేది. అసలు అతనలా మారిపోవడానికి కారణమేమిటా అని ఆలోచించాను. ఎంత ఆలోచించినా కారణం కనుక్కోలేక పోయాను. పోనీ అతన్నే అడుగుదామంటే నా మన స్సొప్పలేదు. అతని బాధను మరింత కెలికిన ట్లవుతుందేమోనన్న సందేహం కలిగి ఊరికే ఉండిపోయాను.

ఒకరోజు నేనూ, సుశీ సినిమాకు బయలుదేరాము. హఠాత్తుగా ఆనాటి సంఘటన జ్ఞాపకం వచ్చింది నాకు. దానికీ, అతని మనోవ్యాకులతకూ సంబంధం ఉందేమోనన్న ఆలోచన తట్టింది. వెంటనే గంగారాంను కేకేశాను.

పెరట్లో పనిచేసుకుంటున్నవాడల్లా నాకేక విని బయటికొచ్చాడు.

"గంగారాం, నీకు జ్ఞాపకం ఉందా ఆరోజు...?"

"ఏరోజండి ?" బుర్ర గోక్కుంటూ అడిగాడు.

"అదే గంగారాం. ఆరోజు పావలా అడిగావు చూడు .... "

ఆమాటతో ఉలిక్కిపడ్డాడు గంగారాం. క్షణంలో అతనిమొహం అదోలా మారిపోయింది. అయినా తనలో జరిగిన మార్పును నే నెక్కడ కనిపెట్టేస్తానోనని, వెంటనే మొహం మామూలుగా చేసుకుని అన్నాడు :

"అదా .... ఆమాట ఇప్పుడెందుకండీ బాబయ్యగారూ !"

నా కుతూహలం ఇంకా ఎక్కువయింది.

"అసలు ఆరోజు పావలాతో ఏం పనొచ్చింది నీకు ?" అని అడిగాను.

గంగారాం మౌనం వహించాడు.

"మాట్లాడవేం గంగారాం ?" అన్నాను మళ్లీ.

"ఆ సంగతి మీతో ఎలా చెప్పేదండీ బాబయ్యగారూ ?"

"పరవాలేదు చెప్పు."

"తమరు మరోలా భావించకూడదు. మా కులపువాళ్లింట్లో ఓపిల్ల ఉండేది. చాలా సక్కగా ఉండేది బాబయ్యగారూ .... నాకు దానిమీద మనసయింది. దానెంట తిరిగేవాణ్ని ..... "

—"ఒకరోజు మల్లి—దానిపేరు అదేలెండి—పట్టుబట్టి అడిగింది : "నాకో చిన్న అద్దం తెచ్చిపెట్టు" అని. కాని ఆరోజు నాదగ్గర డబ్బులు లేకపోతే తమర్ని అడిగాను బాబయ్యా ...."

"ఓస్ ఇంతేనా ? అమ్మగార్నడిగితే ఇచ్చేదికదా గంగారాం అద్దం ? "

"అమ్మగా ర్నెలాగండీ అడిగేది ? నాకు చచ్చేంత సిగ్గేసింది. అయినా అమ్మగారి దగ్గరున్నవన్నీ పెద్ద పెద్ద అద్దాలు. దానికి కావాల్సిందేమో పావలాకు వచ్చే చిన్న అద్దం.

"సరే ఆసంగ తలా ఉంచు. ఈమధ్య నువ్వు అలా పరధ్యానంగా ఉన్నావెందుకు ? మొహమంతా పీక్కుపోయిందేం ? ఆ అమ్మాయిమీద బెంగెట్టుకుని ఇలా అయిపోయావా ? ఆమెను పెళ్లిచేసుకోవాలనుందా నీకు ?" అని ఏకధాటిగా ప్రశ్నలవర్షం కురిపించాను.

"ఇంకెక్కడి పెళ్లండి బాబయ్యగారూ ! నేను అద్దం తెచ్చియలేదన్న కోపంతో అది మరొకడితో స్నేహంచేసుకుంది. ...."

నా తల గిర్రున తిరిగింది. అతని మాటలను అయోమయంగా వింటూ ఉండిపోయాను.

గంగారాం చెప్పుకుపోతున్నాడు.

"ఆ తరువాత నే నెన్నిసార్లు పలకరించినా అది పలకనేలేదు బాబయ్యగారూ. విసురుగా ముఖం తిప్పుకుని వెళ్లిపోయేదండి. మొన్నీమధ్యే దానికి పెళ్లికూడా అయింది."

గంగారాం చెప్పటంఆపి గాఢంగా ఒక నిట్టూర్పు విడిచాడు. ఆ నిట్టూర్పుతో గదంతా వేడెక్కింది.


నెర్వీటాల్
నరముల బలహీనతకునూ, రక్తపోటునకున్నూ రామ బాణము. అనుభవయుక్తముగా చేయబడినది.
8 ఔ. సీసా 5-75, పోస్టేజి 1-75.
ఇండియన్ మెడిసన్ హౌస్,
విజయవాడ-2.

పాదాలలో ఆనెలు
పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్లు పాతుకుపోయి పాదము నేలపై మోపలేక రాళ్లు తగిలిన పుళ్ళుపడువారు పైపూతగా వాడిన వ్రేళ్ళతో సహా మాయంచేయగల పాదరక్షిణి. వెల పోస్టు ఖర్చులతో 4-4-0.
కొక్కొక్కము వివిధచిత్రపటములతో కలదు. వెల పోస్టు ఖర్చులతో సహా రూ. 2-4-0.
ప్రభ అండ్ కో. (P)
3, మలయ పెరుమాళ్ వీధి, (మిన్టపైన)
మద్రాసు-1.

